

# రాజుగారి పెళ్ళాం

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

రామేశ్వరపురంలో అచ్యుతానంద అనే ఆయనొకడుండేవాడు. ఆయనకి చక్కదనాల చుక్క పాపగా పుట్టింది. నామకరణం రోజున అయ్యవారు పాపకు ఏం పేరు పెడతారని అడిగాడు అచ్యుతానందాన్ని.

అచ్యుతానంద కాసేపు దీర్ఘంగా ఆలోచించి పాప పేరు 'రాజుగారి పెళ్ళాం' అని ఖాయం చేయండి అన్నాడు.

అయ్యవారితో సహా అందరూ "అదేం పేరు" అనుకున్నారు.

కాలం గడుస్తున్న కొద్దీ రాజుగారి పెళ్ళాం పెరిగి పెద్దదవసాగింది. దిదివి దీవం పెట్టుకునేంతగా సౌందర్యాన్ని సంతరింపజేసుకుంది. విద్యా బుద్ధుల్లో కూడా మేటిగా రాణించింది.

ఎక్కడికెళ్ళినా తనపేరు

రాజుగారి పెళ్ళాం అని చెప్పగానే, అందరు గౌరవ మర్యాదలు ప్రదర్శించేవారు.

ఇదిలావుండగా ఒకసారి ఈ విషయం ఆ దేశపు రాజు శైలేంద్రవర్మకు తెలిసింది. ఆయన తండ్రీ కూతుళ్ళను తన అంతరంగిక మందిరానికి పిలిపించుకుని - "మిమ్మల్ని రాజసభలోనే విచారించవచ్చు. కాని ఇది ఒక యువతికి సంబంధించిన విచారణ అయినందువల్ల ఇలా జరుపుతున్నాను" అని క్రీగంట రాజుగారి పెళ్ళాం వంక ఓమారు నిశితంగా చూసి ఆమె సౌందర్యానికి ముగ్ధుడై... తర్వాత సర్దుకుని "చెప్పు మీ అమ్మాయికి 'రాజుగారి పెళ్ళాం' అని పేరు ఎందుకు పెట్టావా?" అని అడిగాడు అచ్యుతానందాన్ని.

"మా అమ్మాయి పుట్టంగానే దాని అందచందాలు చూసి నాకు కలిగిన ఆలోచన అది. తర్వాత అయ్యవార్లతో వేయించిన జాతక చక్రంతో అది మహర్జాతకురాలని తేలింది. చక్కగా చదివించాను. యోగ్యురాలిన చేశాను.

పాత్ర ఎరిగి దానం చెయ్యమని చెబుతారు పెద్దలు. మరి నేను కన్యాదానం చెయ్యాలంటే తీసుకునేవాడు ఎంత ఉత్తముడు, ఉన్నతుడు అయివుండాలి? అందుకే బాగా యోచించి మరీ ఆపేరు పెట్టాను.

ఇకపోతే మామూలు పేరు ఏదన్నా పెట్టుంటే... మా అమ్మాయి విషయం మీ దాకా వచ్చేదా? అందుకే ఆలోచించి ఆ పేరు పెట్టాను" అన్నాడు.

"మీ ముందు చూపుకి నా అభినందనలు.. పిల్ల పుట్టంగానే నా భార్యని చేయడం బహుశా భగవంతుడి సంకల్పం అయుంటుంది. ఏదేమైనా చక్కని చుక్కని నాభార్యని చేసినందుకు మీకు కృతజ్ఞతలు మామగారు" అని అచ్యుతానందాన్ని మనసారా అభినందించాడు శైలేంద్రవర్మ.